# మితానుభవము

## 598 మద్యపానములోని మోసము

రా –నాదనామ క్రియ (చాయ : భజనజేయు విధము దెలియుండి) తా –అట

మద్యపాన ప్రియులు గాకుండి – ప్రియులార మీరా– మత్తులోనే మునిఁగి పోకుండి = మద్యపానము చేయువారికిఁ – దథ్యముగఁ బ్రాప్తించుఁ గీడులు – కొద్దియైనను రుచిని జూడఁగఁ – గోరఁ దగ దని తలఁచుకొనుఁడి ॥మద్య॥

1. రక్త మంతయుఁ జెడును సుమ్మండి – ప్రియులారా మీరు – శక్తిహీనులగుదురిల నుండి = శక్తిహీనులె గాక మఱి మీ – భక్తి దొఁలగి పోవునండి – ముక్తిమార్గము దెలియదండి – ముందు గతికి హీనమండి ॥మద్య॥
2. బుద్ధిబలములు కొద్ది వౌనండి – ప్రియులారా మీరు – మొద్దు లగుదురనియు నమ్మండి = హద్దు మిరుచుఁ ద్రాగువారికిఁ – గొద్దికాలమె జీవమండి – శ్రద్ధగల్గి మద్యపానము = రద్దు చేయుట తగినదండి ॥మద్య॥
3. మచ్చునకును త్రాగఁబోకుండి – ప్రియులార మీరీ – తుచ్ఛమైన పనులు వీడుండీ = హెచ్చుగాఁ దిని త్రాగువారికి–వచ్చు రోగము కుదురదండి – చచ్చుటకు నిది హేతువని మదిఁ – గచ్చితముగను దెలిసికొనుఁడి ॥మద్య॥
4. ఆలుబిడ్డల మేలుఁగోరుండి – ప్రియులారా వారి –మేలుఁ గోరినఁ ద్రాగంఁ బోకుండి = మేలు లెఱింగి పిలుచు క్రీస్తుని – జాలిచూపులు దెలిసికొనుఁడి– కాలయాపనఁ జేయకుండి – కర్త యేసని నమ్ముకొనఁడి ॥మద్య॥
5. ఘన ధనములు నిలువఁబోవండి – ప్రియులార నీచ – తనము మీకు మూల మౌనండి = తనవిఁదీర్చుదు మద్యమండి – ఘనుల కొంపలు గూల్చునండి – ఘనముగాఁ బ్రభువాక్యసారము– వినయమతితో ఁ గ్రోలరండి ॥మద్య॥

*–నేలటూరి లూకర్*

# క్రైస్తవ వైద్యశాలలు

## 599 క్రీస్తు అనుగ్రహించు స్వస్థత

రా –మిశ్రమ (చాయ : శరణు జొచ్చితి) తా –ఆది

పరమ వైద్యుఁడ భారతీయుల – వ్యాధి బాధలఁ బాపుమా = పరుల కుపచారం బొనర్చుట – పరమ విధియని చూపుమా ॥పరమ॥



1. ప్రేమతో వైద్యులును దాదులు – పెంపుఁ బొందఁగజేయుమా = గ్రామ రోగులఁ గాంచి వారికి – క్షేమమును దయ చేయుమా ॥పరమ॥
2. భరత ఖండము నందు వైద్యపు – బడులను నెలకొల్పుమా = పరఁగ నీవే వైద్య శాలలఁ – బాలనంబు సల్పుమా ॥పరమ॥
3. కుఁటి గ్రుడ్డి మూఁగ సాలలఁ –గూర్మితో దర్శించుమా = యంటు రోగుల యాశ్రయముల – నంటి పరామర్శించుమా ॥పరమ॥
4. లెక్కలేని గర్భవతుల – యక్కఱలను దీర్చుమా = దిక్కు లేని బిడ్డలకు నీ – దీవెనల సమకూర్చుమా ॥పరమ॥
5. యంత్రశాలల గనులయందు – నలయు వారలం బ్రోవుమా = మంత్ర తంత్రము లందుఁ జిక్కు న– మాయకులను గావుమా ॥పరమ॥
6. గ్రామ వైద్య సేవఁ జేసెడి – ఘనులఁ బరిపాలించుమా = గ్రామవాసులఁ గూల్చు వ్యాధులఁ – గాంచి నిర్మూలించుమా ॥పరమ॥
7. దురభిమాన మూఢ భక్తిని – ద్వరగ దూర పరచుమా = మరియు శుచిచే రోగములు మటు – మాయ మగు నని కరపుమా ॥పరమ॥
8. దేహశుద్ధిని జిత్తశుద్ధిని దేశ జనులకుఁ గూర్చుమా = దేహములఁ బర శుద్ధ మగు నీ – దేవళములుగ మార్చుమా ॥పరమ॥

*– మల్లెల దావీదు*

# సంవత్సరాద్యంతములు

## 600 సంవత్సరాంత్య ధ్యానము

రా –బిలహరి (చాయ : కొనియాడదరమె నిన్ను) తా –ఆది

ధ్యానింప నే చిత్తమా – వర్షాంతమున – ధ్యానింపనే చిత్తమా= ధ్యానించ వాసక్తి – జ్ఞానంబుఁ గలిగించు – జ్ఞాన స్వరూపుఁడు – జ్ఞానాత్మచే నీకు ॥ధ్యానింపవే॥

1. అరయ నీ తలఁపుల – నఘము లగుపడు నీకుఁ – పరిశుద్ధుఁ డీక్షింప బహుగా గనుపడుచుండు ॥ధ్యానింపవే॥